



**నిం**డు పున్నమి వెన్నెల. తెల్లవారిందనుకోని ఒక్కొక్కరే లేస్తా వుండారు. ఆసాములు లేస్తావుండారని బెరసకోల్లు ఖనామని కూతలేస్తావుండాయి. అమ్మ రెండు రెక్కలనిండా ఒదుక్కోని కూర్చోని వుండే కోడిపిల్లలు గూడా అమ్మనొదిలేసి మేతకని లేసినాయి. సెవుల నిండా గిలకబాయి శబ్దమే. నిద్దర రాని ముసిలోల్లు నడీదుల్లో కందికట్టె తెచ్చి సలిమంటలేస్తావుండారు. మంచుగురిసి ఒళ్లంతా తడుపుకున్న వూరకుక్కలు సలికి తట్టుకోలేక మంటల దగ్గరకి వస్తావుండాయి ఒళ్లు కాసుకోడానికి.

# బండెనక బండి




ఆకలికి మొకమోసిన పెయ్య దూల్లు పొదుగు గురుసుకోవాలని సందుపోకుండా అరుస్తా వుండాయి. దీండ్ల అరుపులకు మొద్దునిద్దర మనుషులు కూడా ఉలిక్కి పడి లేసినారు. సంకురాత్తిరి సంబరాన ఆడోల్లందరూ లేసి బకెట్లనిండా పేడనీల్లు కలుపుకోని ఇంటిముందర తెరిపి లేకుండా జల్లుతా వుండారు. సీరెకుచ్చిళ్ల బొడ్డుకింద చెక్కోని తేమ ఆరకముందే సూడముచ్చటైన ముగ్గులేసినారు.

మొగపిల్లకాయలు ఎద్దులకు మడ్డి కలిపిన నీల్లు తాపుతా వుంటే మడ్డి ఉడికిన వాసన వీధిలోకి వస్తావుండాది. ఇన్ని పనులు జరిగినా ఇంగా తెల్లవారనే లేదు. ముత్యాల్లాంటి గింజలు ఇంటికొచ్చిన సంతోసం, సంకురాత్తిరి రాక సంబరం, ఇంటినిండా ఆడ బిడ్డలు, అల్లుళ్లు, వాళ్ల పిల్లోల్లు, ఇంత సంబరం ఇంటినిండా బెట్టు

కోనుంటే తెల్లవారిందో లేదో ఎవరు సూస్తారు! అయినా తెల్లవారితేనేనా సెత్తబండ్లు కట్టేది. ఆమన్లో ఆ ఎద్దులకు, ఈ సేద్యగాల్లకు ఎవురికీ నిద్దుర్రాదు.

* * *

''ఏం బాలిరెడ్డి సిన్నాయనా! బసిరెడ్డి కన్నా ముసిలిరెడ్డే నయమే అన్నెట్టుండాది నీపని. అవతల అందరూ వీధుల్లో బండ్లుబెట్టి కాడి సగేసింటే నువ్వేంది ఇంగా ఎద్దులకు నీళ్లు తాపుతా వుండావు'' అంటా వుండాడు జయరాముడు.

''చూడు జయరాముడూ.. తొందరపడితే ఏమొస్తాది. ఏపనైనా కుదురుగా చేస్తాము. మొన్న ఎరువుబండ్లప్పుడు తొందరపడేగదా వెంకటసుబ్బిగాడు బంగారమట్లాంటి ఎద్దుల్ను ఆ గవినిసారవ బురదలో ఇరికిచ్చుకోని, ఎద్దుల్ను బయపడి పోయేలా చేసుకున్నాడు. ఆ గిత్తలు ఇప్పుడు అరక బట్టాలంటే ఒప్పుకోవడంలే. పరిగెత్తి పాలు తాగేదానికన్నా నిలబడి నీల్లు తాగడమే మంచిది గదా'' అన్నేడు బాలిరెడ్డి.

''సిన్నాయనా! పొద్దులేని కాలం. తెల్లార్జామున బండిగడితే కదా మనం పిప్పిసెత్త వామిదొడ్లల్లోకి తోలుకుండేది. అదో ఇదో అనేలకు పొద్దుమీరిపోతాది. ఎద్దలకూ, మనకూ అందరికీ అలుపేగదా టైము మీరితే'' జయరాముడు తిరుగు జవాబు సెప్పినాడు.

ఆకాశంలోనుంచి వెన్నెల జారుకుంటాండంగలోనే పగులొచ్చింది గచ్చకాయ మాదిరి. వీధిలో టైర్లబండ్లన్నీ కనుసొంపుగా నిలబడి వుండాయి. బండిమింద నాట్లు, గోగునార మోకులు, బిల్లసెరుగులు అన్నీ వచ్చి చేరినాయి.

ఒక్కొక్కరే ఎద్దులను తెచ్చి బండికడతా వుండారు. ఒకదాన్ని చూసి ఒకటి ఎద్దులు రంకెలేసుకుంటా వుండాయి. రొండునెలలు పనిలేక ఉల్లాసంగా వుండాయి. బండ్లన్నీ ఎనకా ముందు బోతా వుంటే ఏకుచాపలన్నీ కొత్తనీల్లకు ఎదురుబొయినట్టుంది. బండ్లబాటలో బండెనకబండి సెరువుకింద మల్లల్లోకి పోతావుంటే నెత్తికి సిక్కుతీసి సక్కంగ పాపిటబిల్ల బెట్టినట్టు కనపడ్తా వుంది మసక సీకట్లో కూడా ఆ బండ్ల వరస.

* * *

వరిసెత్త కట్టలుగట్టి ఒర్రెలు బెట్టి వుంటే బారెడు పొడుగు బంగారురేకుల్ను కుచ్చులేసి పడుకోబెట్టినట్టు వుండాది కల్లాలల్లో. నోరులేని మూగజీవాలకే కాదు ఆ సెత్తను సూస్తావుంటే మనుసులు కూడా తినేట్టుగా వుంది.

ఎవురి కల్లాల్లోకి వాళ్ల బండ్లు పోయి నిలబడుకోనుండాయి. పిప్పిసెత్తను చెయి తగుల్తానే సల్లంగా ఐసుముక్కల మింద పెట్టినట్టుంది ఘంచుకురిసిందాన. పిల్లనాయాల్లకు పనిమిందికి మనసు పోకుండా వుంటే జయరాముడన్న ''నాయాల్లారా తెల్లారుజామున పనికొంగాలంటే ఎందుకురా మీకంత మజ్జు. మేమూ మొగోల్లమని వూరంతా మెరవని చేసుకోని చేసుకుంటిరి కదురా పెండ్లి.



ఆరోజు లేదురా మీకు మజ్జు. ఆరొంత పాణం పోతే ఎట్టా బతుకుతార్రా'' అనేటాలకే బండికి సెత్తకట్టలు అందిచ్చే వగిసిపిల్లోల్లకు రోస మొచ్చింది.

జయరాముడి మాటలకు శంకరుగానికి బాగా కోపమొచ్చి ''చూడు జయరాముడు మామా! నువ్వు బండికి ఎంతెత్తు కట్టలు వేసుకుంటావో వేసుకో. ఒక్క కట్ట కిందబడితే నీ కాలి సెప్పుతో కొట్టు నన్ను'' అంటా వాడు సెత్త కట్టలు యేస్తావుంటే వడిసెల్లో రాళ్లు గువ్వలమిందకు పోయినట్టే వుండాది.

* * *

సెత్తకట్టలు బండ్లకెయ్యడమూ, బండిమింద బేర్సుకోవడమూ అందరితో అయ్యేపనేనా. ఆ పదహారు పల్లెల్లో సెత్త బండ్ల కాలము రాంగానే సన్నబల్లె రాజాగాడు శానా ఫేమసు.

వాడు అన్నిట్లో పనివంతుడే. ఎద్దుల్ను సూస్తానే వాడు ఈ గిత్తలు ఎంత సెత్త ఈడుస్తాయో సెపుతాడు.

అరకా లావా సూసుకోని కట్టలు బేరుస్తా వుంటే బేల్దారి నరసింహులు తాడు పట్టి గోడకట్టినట్టే వుంటాది. యాన్నేగానీ పోగు బైటికి రాదు. ఎద్దును బట్టి పనిచేయిస్తాడు. బండినిండా సెత్తబేర్సి మోకులకు బిల్లసెరుగులేసి కొన్నగలకు కట్టినాడంటే బండి వతికెలబడినా సెత్త కింద పడకూడదు.

రాజాగానికి కుదరుండదు గానీ, పనికొంగినాడంటే మాత్రం వాని మాదిరి బండికి సెత్త వేసేవాడు నూటొక్క జిల్లాలో లేడు. అర్రుమింద నగలు మొయ్యకుండా ఆడతా వుంటాది కాడి వాడు బండికి సెత్త వేస్తే. అంత సొగుసైనోడు యాడన్నా వుంటాడా అనిపిస్తాది.

ఎద్దులకు సెండుతాల్లు కట్టి పగ్గం బిర్రున నగలకు కట్టేసినా నిలబడలేకుండా వుండాయి. పరుగులు తీస్తా పోదామా అనుకుంటా వుండాయి.

* * *

మూడు బండ్లకు సెత్త ఏసిచ్చి నాలుగో బండికాడికి వచ్చినాడు సన్నబల్లె రాజా.

ఆ బండి వీరారెడ్డిది. ఎద్దలతిక్కు చూస్తానే వానికి అనుమానమొచ్చింది. దీంట్లకు బండినిండా సెత్త యేస్తే ఈడుస్తాయో లేదో అనుకున్నేడు. ''ఏం వీరాడ్డి పెదనాయనా! ఆ వలపటదాన్ని యాడ తెచ్చినావూ'' అన్నేడు.

''సెండువాయి దగ్గర తెచ్చిన రాజా'' అన్నేడు.

''దీనికి ఈపున పరక సుడి వుంది పెదనాయనా. ఈరకం గిత్తలు ఈడుస్తే అడ్డంగా ఈడుస్తాయి. లాకుంటే బండనేస్తాయి నెత్తిమింద'' అన్నేడు.

వీరాడ్డి మాత్రం ఆ మాటలు ఒప్పుకోలే. ''ఏందిరా రాజా! నేనూ ముప్పై ఏండ్ల సేద్యాగాన్ని. ఆ మాత్రం ఎద్దుల గురించి నాకు తెల్దా. అది మంచి పసికోడెరా. కొమ్మువాటమూ, కాలివాటమూ




తరచి చూడాలేగాని, ప్రకృతి అందాలకు కొదవేలేదు. మితిమీరిపోతున్న సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామిక కాలుష్యం వల్ల పక్షులు, జంతువులు క్రమక్రమంగా అంతరించిపోతున్నాయి. కొన్నాళ్లకు పూర్తిగా లేకుండాపోయినా ఆశ్చర్యం లేదేమో! గత యాభయ్యేళ్లుగా అంతరించిపోయిన పక్షుల జాబితాలోకి చేరిన ఈ పక్షి ఇప్పుడు వున్నట్టుండి ప్రత్యక్షమై, పర్యావరణ ప్రేమికుల నెత్తిన పాలుపోసింది. నల్లటి టోపీ, ముక్కుకిరుపక్కలా ముదురు పసుపు రంగు మచ్చలు, మేలిమి బంగారం, ఊదా, బూడిదరంగులతో మిలమిలా మెరిసిపోయే మేనిఛాయ, రంగురంగుల కుచ్చు తోకతో భలే ముద్దుగా వున్న ఈ పిట్ట ఇటీవల వున్నట్టుండి అరుణాచల్ ప్రదేశ్‌లోని వన్యప్రాణుల సంరక్షణ కేంద్రంలో కనపడింది. ఎప్పుడో యాభయ్యేళ్లక్రితమే కనుమరుగయిందనుకున్న గద్దజాతికి చెందిన ఈ పిట్ట ఇప్పుడు అందరినీ అబ్బుర పరుస్తోంది.

కుదురు కలిగిందిరా. దాని గంగడోలు సూడు మెరుస్తా వుండాది. రొండువేలా ఏన్నూర్లు పెట్టి కొన్నారా. ఈపుమింద కుంకుమ పోసుకోని, మొగతాడుకు పగ్గం కట్టి తీసుకోని వస్తావుంటే అందరూ వీధుల్లోకొచ్చి నిలజూసినారురా'' అంటా సెబుతావుంటే రాజాగాడు రోంత తగ్గినాడు 'ఏందబ్బా నా అంచనా తప్పయిందా' ఏందని.

వీరాడ్డి సెప్పినట్టే మూడొరసలు బెట్టి సెత్త పదారడుగులు పైకి వేసినాడు. బండికి సెత్త పేర్చించే కంటువామి అయినట్టు వుండాది.

బండ్లన్నీ ఒక్కొక్కటే కదిలినయి.

వీరాడ్డి బండికి నగల్లో కొడుకు లచ్చుమయ్య కూర్చున్నాడు.

ఒక్కొక్కటి రంగమ్మ తోటదగ్గిర కాలవ దాటుకుంటా వుండాయి.

అక్కడికొచ్చాలకే వీరాడ్డి ఎద్దులు పెనకు తిరుక్కున్నాయి. వలపట గిత్త ఈడ్సడానికి అస్సలు పూనుకోలేదు. వీరాడ్డికి కోపమొచ్చి మోచేత్తో డొక్కల్లో పొడిసినాడు.

అంతే! కాడిమాను గొంతుకిందికి తెచ్చుకోని పండుకున్నేది.

రాజాగాడు బండికాన్నే వుండాడు. ''చూడు వీరాడ్డి పెదనాయనా. పరకసుడి వుండేదాన్ని తెచ్చుకోని బాధపడ్డే ఎట్టా పెదనాయనా. ఎద్దును చూస్తే ముద్దొస్తాది.. ఈడుపును చూస్తే ఏడుపొస్తాది. సుళ్లూ సుగుణాలూ అని వూరికనే అన్నేరా పెద్దోలు. ముప్పై కాండ్లను మార్చిండచ్చు పెదనాయనా నువ్వు.. కానీ పరకసుడి దాంతో పనిచేయిచ్చుకోనుండవు నువ్వు. దాండ్ల కత నాకు సెబుతావా'' అనేలకే వీరాడ్డి అందరిముందరా తలకాయ వంచుకున్నేడు.

పల్లెల్లో ఎద్దు ఈడ్సలేక పండుకున్నాదంటే రైతుకు పెద్ద అవమానం.

* * *

వరికోతలు అయిపోయినాయి. పిప్పి సెత్త కూడా ఇంటికిపోతావుండాది. వూర్లో పశువులకు కట్టుబడి కూడా ఎత్తేసినారు.

బూమిలో ఇంగా తడి వుండాది. అందుకేనేమో వరి కొయ్యకాల్లు మల్లా మోసులెత్తినాయి.

ఆ మోసులు చూస్తానే గొర్లమందలకు పులిబోజనం తిన్నెట్టే. అందుకే సుట్టూ నాలుగూర్ల గొర్లమందలు ఆయకట్టు బూముల్లోకి వచ్చినాయి. ఆదరాబాదరా నోటినిండా వరిమోసుల్ను తింటా ముందుకు ముందుకు పోతావుండాయి. గొర్లబోయుడు ఈతబొచ్చుగాని మంద అన్నిటికీ మిర్రుగా కనిపిస్తా వుండాది. వానిగురించి ఒకసారి సెప్పుకుందాం గానీ, బీడుకయ్యల్లో గొర్లమందలు వచ్చేటాలకే పైరు వడ్లను గాదు గొర్లను ఈనిందా ఏందిరా అనిపిస్తా వుండాది.

ఆ గొర్ల మందల నడుమనుంచే ఒక్కొక్క బండీ ఇంటికి బోతావుండాది.

* * *

రాదావా పోదావా ఎప్పుడైనా వరసగా బోవాల్సిందే. వూరు వూరంతా ఎప్పుడూ ఒక్కమాటమిందనే వుంటాది గాబట్టి బండ్లుగూడా ఎనకాముందు రావాల్సిందే.

వీరాడ్డి ఎద్దల్ను ఇప్పేసి బండి కాలవలోంచి బయటికి లాగినయి బాలిమామ కోడెలు.

బైటికొచ్చినాక మల్లా వీరాడ్డి ఎద్దులనే కట్టి ఊరి దావ బట్టిచ్చినారు. ''బయపడిన ఎద్దులు ఎనకాల ఎందుకు నడుమకు తీసకరాండ్రా'' అని సెప్పినాడు బాలిమామ.

అప్పుడు వీరారెడ్డి బండిని గుంపులో కలిపినారు. వరిసెత్తను బండ్లమింద వేసుకోని వస్తావుంటే బంగారు గుడిసెలకు కాల్లొచ్చి నడిసొచ్చినట్టుండాది వూర్లేకి.

పాతర్లు నిండినట్టే వరిసెత్త వామిదొడ్లలో దిగ

దోస్తే వాములోములు బడింది సెత్త.

ఈ సెత్తను జూసి, చెన్నాడ్డెబ్బ ''రైతు ఎప్పుడూ గింజలు పండినాయని కాదురా సంతోసపడా ల్సింది. వామినిండా సెత్త వుంటే సంతోసపడాల. మనల్ను నమ్ముకోని మన గాటికొచ్చిన గొడ్లకు కడుపునిండా తిండి దొరికితే మనం గూడా మన మొగసాలల్లో కులాసగా మాట్లాడ్తం నాయనా. మనకు లేకపోతే నాలుగిండ్లు అడుక్కోనయినా తింటాము. ఈ నోరులేని గొడ్లు ఎవురింటికీ పోవురా. దాండ్ల మింద మనకు నమ్మకం లేకపోయినా, మనమింద మాత్రం దాంట్లకు నమ్మకం ఎక్కువరా. గాటికి గొడ్డొచ్చిన యాల, ఇంటికి ఇల్లాలొచ్చిన యాల అంటారు. మనకు లచ్చిమి కళ అంటే ఆ ఇద్దురేరా. వాల్లిద్దుర్నీ మన బిడ్డల్లా సూసుకోవాల'' అంటా సెబుతా వుంటే...బండ్లల్లోనుంచి సెత్త దిగదోస్తా వుండే పిలకాయలందరూ ఆలకిస్తా వుండారు.

* * *

బండ్లల్లో సెత్త వామిదొడ్లల్లేకి వచ్చిందో లేదో.. కిరసనాయిలు బుడ్డి కిందబడి బాలెంకటమ్మ కొట్టం అంటుకున్నాది.

కండ్లు మూసి తెరిసేటాలకే ఆ పొగ, మంటలు ఏందిరా అని అందరికీ అనుమానమొచ్చింది.

ఊర్లో అందరికీ ఒక్కసారి గుండెలవిసినాయి.

గింజలన్నీ ఇంట్లోనే వుండాయి. సెత్తంతా వామిదొడ్లలో వుంది. ఏమన్నా అయితే ఊర్లో ఒక్కరు సంసారం చేయబట్టదు. అయితే ఆవూరి ఆడోల్లకు మొగోల్లకు ఆ మంటలు చూసేటాలకు ఏదో శక్తి పూనింది. పిల్లాజల్లా తేడా లేకుండా బాలెంకటమ్మ కొట్టంలోకి పోయి అన్నీ బైటేస్తా వుండారు. రాజా భార్య నరసమ్మయితే నూరు కేజీల రాగుల మూట ఒక్కటే బైటికి తీసుకోని వచ్చింది. ఆమెను చూసి అందరూ బిత్తరబోయినారు. మట్టిపోసేటోల్లు, నీల్లుజల్లే వాళ్లు.. నిప్పుకొకరు పుట్టినారు ఆ ఊర్లో.

పొగలు నల్లమోడాల్లోకి చేరుకోకముందే మంటలన్నీ మాయం చేసినారు. ఏమన్నా అయిందంటే ఊరంతా కాలిపోతాది. కొత్త సెత్త వామిదొడ్లల్లో వుంది అందుకే భయం.

కొట్టం కాలిపోయి బాలెంకటమ్మ కుటుంబమంతా శోకాలు పట్టి ఏడుస్తా వుండాది పండగపూట.

''ఎందుకమ్మా అట్లా ఏడుస్తా వుండావు. నీ కొట్టం కాలిపోయింది అంతే. ఈ ఊర్లో అందరూ బతికే వుండారు కదా. ఆ భయం నీకొద్దు'' అంటా చిన్నసుబ్బాడ్డి ధైర్నం చెబుతా వుండాడు.

రాత్రికి అందర్నీ రాముల్దేలం దగ్గరకు పిలిపిస్తే, ఇంటికింత డబ్బులేసినారు. కొందరు సెత్త కూడా ఇచ్చినారు. రగ్గులు, టువాళ్లు ఎవరికి తోసినట్టు వాళ్లు ఇచ్చినారు. మడవకట్టే మన్రాజు తెల్లవారేలకే నిట్టాడి నిలబెట్టి, కొట్టానికి ఎదురు కొయ్యలు పరిసినాడు.

వూరు వూరంతా కలిసి బాలెంకటమ్మ కొట్టాన్ని కొత్తసెత్తతో కప్పి బంగారు రంగులో మెరిసిపోయేట్టు చేసినారు.

''అగ్గిదేవుడి ముందు మనమెంత నాయనా. మన వూరి మనసు మంచిది కాబట్టి, మన బాధ ఆలకించినాడు ఆ దేవుడు. ఊరు తగులుకునింటే మనమేమన్నా సేయగలమా. అయినా ఆడకూతురు కంట్లో నీళ్లు అగ్గిదేవుడు కూడా సూల్లేడు నాయనా!'' అంటా వెంకారెడ్డితాత సెబుతా వుంటే శరీరం సల్లగా అయింది.

* * *

వారం రోజుల్లో సంకురాత్తిరి పండగ వస్తాది. వామిదొడ్లల్లో సెత్త పండగ దాంకా వాములేసేది లేదు. మూన్నాళ్ల పండగను శక్తికొద్దీ చేసి, తీరిగ్గా సెత్త జోలికిబోవాల.

అప్పుడుగాని చూపియ్యరు వామేటుగాళ్లు జంబం. దగ్గుతా బోతే సొంటి పిర్రెమని వూరికెనే జెప్పలేదు. ఈ మూన్నాళ్ల పండగ పోనీ అప్పుడు మాట్లాడుకుందాం వామేటుగాళ్ల గురించి. ముఖ్యంగా ఆ వామేటుగాడు ఓబుల్‌రెడ్డి గురించి!

★

